



EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4 PM
www.suryaa.com
శనివారం
07-02-2026
పేజీలు: 02




## వందేభారత్ రైళ్లకు బాంబు బెదిరింపు

వందేభారత్ రైళ్లను పేల్చేస్తామని బెదిరిస్తూ రైల్వే అధికారులకు ఓ అగంతకుడు లేఖ రాసిన ఘటన కలకలం రేపింది. ఈ లేఖ ఈ నెల (ఫిబ్రవరి) 3వ తేదీన ఓ పోస్టు ద్వారా రైల్వే జీఎంకు చేరినట్లు అధికారులు తెలిపారు. ఈ లేఖలో హైదరాబాద్‌లో ఉంటున్న నలుగురు జిహాదీ బృందం వందేభారత్ రైళ్లను లక్ష్యంగా చేసుకుని దాడులకు పథకం వేశారంటూ అగంతకుడు లేఖలో పేర్కొన్నాడు. వందేభారత్ వెళ్లే లైన్లలో బాంబులు పెట్టి 250మందిని చంపేదుకు పథకం వేశారంటూ లేఖలో ప్రస్తావించాడు. రైల్వే మార్గాల్లో ప్రమాదకర చర్యలకు సిద్ధమయ్యారనే ఆరోపణలను లేఖలో ప్రస్తావించారు. అలాగే, నలుగురు వ్యక్తుల పేర్లను కూడా లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ లేఖ అందిన వెంటనే రైల్వే పోలీసులు అప్రమత్తమయ్యారు. భద్రతా దృష్ట్యా వందేభారత్ రైళ్లు, రైల్వే ప్రాంగణాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల భద్రతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైల్వే అధికారులు స్పష్టం చేశారు.




## T20 వరల్డ్‌కప్‌కి అంతా సిద్ధం

టోర్నీ ఆరంభానికి ముందే వివాదాలతో నలుగుతున్న రంగం సిద్ధమైంది. నేటి నుంచి మార్చి 8 వరకూ టోర్నమెంట్ జరగనుంది. 20 జట్లు పోటీ పడుతున్న వేళ.. మొత్తంగా 55 మ్యాచ్‌లతో కొత్త ఛాంపియన్ ఎవరో తేలనుంది. అలాగే ఆరంభం రోజైన ఇవాల్టి నుంచి గ్రూప్ దశలో ప్రతి రోజూ 3 మ్యాచ్‌లు జరగనున్నాయి.

### టీ20 వరల్డ్‌కప్‌లో తొలి మ్యాచ్ ప్రారంభం.. ముందుగా నెదర్లాండ్స్ బ్యాటింగ్


టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ ఉత్సాహభరితంగా ప్రారంభమైంది. తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్, నెదర్లాండ్స్ జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌కు శ్రీలంకలోని కొలంబో సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానం ఆతిథ్యం ఇస్తోంది. టాస్ గెలిచిన పాకిస్తాన్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా ముందుగా ఫీల్డింగ్ ఎంచుకోగా, నెదర్లాండ్స్ తొలుత బ్యాటింగ్ చేస్తుంది. టాస్ అనంతరం మాట్లాడిన పాకిస్తాన్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా పిచ్‌పై తేమ ఉండే అవకాశం ఉందని తెలిపారు. గత కొన్ని రోజులుగా వర్షాలు కురవడంతో బౌలర్లకు అనుకూలంగా ఉండొచ్చని అంచనా వేశారు. ఇది కొత్త పిచ్. పచ్చిక కూడా ఉంది. పేసర్లతో పాటు స్పిన్నర్లు కూడా రాణించే అవకాశం ఉంది.



## బెదిరిస్తే ఎదురు నిలబడండి.. పాక్ ఆరోపణలపై గవాస్కర్ ఫైర్

మరికొన్ని గంటల్లో టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభం కానుండగా, క్రికెట్ కంటే అనూహ్య పరిణామాలు, డ్రామానే ఎక్కువగా కనిపిస్తున్నాయి. టోర్నమెంట్ ఆరంభానికి కొన్ని రోజుల ముందు, పాకిస్థాన్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ నెల 15న భారత్‌తో జరగాల్సిన గ్రూప్ మ్యాచ్‌లో తమ జట్టు పాల్గొనదని ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం టాస్ కోసం భారత ఆటగాళ్లు మైదానంలోకి వచ్చినా, పాక్ జట్టు మాత్రం రాదని తేలిపోయింది. భారత్, ఐసీసీతో కలిసి తమను, ఇతర క్రికెట్ దేశాలను 'బుల్లీయింగ్' (బెదిరింపులకు) గురిచేస్తోందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని పాకిస్థాన్ ఆరోపిస్తోంది. పాక్ ప్రభుత్వ నిర్ణయాన్ని ఆ దేశ క్రికెట్ బోర్డ్ (పీసీబీ) మాజీ ఛైర్మన్ నజమ్ సేఠీ సమర్థించాడు. చాలా కాలంగా బీసీసీఐ తమపై ఆధిపత్యం చెలాయిస్తోందని, ఈ నిర్ణయంతో ప్రతీకారం తీర్చుకోవడానికి సరైన అవకాశం లభించిందని ఆయన వ్యాఖ్యానించాడు.

## అదనపు టారిఫ్‌లను తగ్గించిన ట్రంప్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ కు శుభవార్త చెప్పారు. ఇటీవల భారత్ పై విధించిన ప్రతీకార సుంకాల (25 శాతం) ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. రష్యా నుంచి చమురు దిగుమతులను ఆపేసే విషయంలో భారత్ కట్టుబడి ఉందని, దీంతో టారిఫ్ లను తగ్గిస్తున్నామని ట్రంప్ చెప్పారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ పై ఆయన శుక్రవారం సంతకం చేశారు. అమెరికా, భారత్ ల మధ్య ఇటీవల కుదిరిన ట్రేడ్ డీల్ లో భాగంగా 7 శాతం టారిఫ్ లను ట్రంప్ తగ్గించిన విషయం తెలిసిందే. తాజా ప్రకటనతో భారత్ పై అమెరికా పన్నుల భారం 18 శాతానికి తగ్గింది. రష్యా — ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలపై ట్రంప్ అప్పట్లో ప్రతీకార సుంకాలు విధించారు. ఆయా దేశాల నుంచి అగ్రరాజ్యానికి దిగుమతి అయ్యే వస్తుసేవలపై 25 శాతం పన్నులు విధించి అమలు చేశారు. ఈ జాబితాలో భారత్ కూడా ఉంది. దీనికితోడు భారత్ పై అదనపు సుంకాలు మరో 25 శాతం విధించారు.

## జగిత్యాల జిల్లాలో దారుణం.. భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త

జగిత్యాల జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. కట్టుకున్న భార్తను భర్త దారుణంగా హతమార్చాడు. ఈ విషాదకర సంఘటన జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మల్లయ్య, సత్తవ్వ దంపతుల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం సత్తవ్వను మల్లయ్య గొడ్డలితో నరికి చంపి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


## సూర్యవంశీ సూపర్ సెంచరీ



అండర్-19 ప్రపంచకప్‌లో భారత్ టైటిల్ విజేతగా నిలిచింది. టైటిల్ ఫేవరేట్ హోదాకు తగ్గట్లు మెగాటోర్నీలో అపజయమెరుగని యువ భారత్ ఆరోసారి వరల్డ్‌కప్‌ను తమ సొంతం చేసుకుంది. శనివారం పరుగుల వరద పారిన ఫైనల్ పోరులో ఇంగ్లండ్‌పై టీమ్ఇండియా 100 పరుగుల తేడాతో చరిత్రాత్మక విజయాన్ని అందుకుంది. మెగాటోర్నీలో ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ ముందుకు సాగిన ఆయూశ్ మాత్రె సారథ్యంలోని యువ భారత్.. విజయదుందుభి మోగించింది. తొలుత ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(80 బంతుల్లో 175, 15ఫోర్లు, 15సిక్స్‌లు) ధనాధన్ సెంచరీకి తోడు కెప్టెన్ ఆయూశ్ మాత్రె(53), అభిజ్ఞాన్ కుందు(40) రాణించడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 411/9 స్కోరు చేసింది. హైదరాబాదీ బ్యాటర్ ఆరోన్ జార్జ్ (9)నిరాశపరిచినా..సూర్యవంశీ తన సహజసిద్ధమైన శైలిలో బౌండరీలతో విరుచుకుపడ్డాడు. 55 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్న ఈ బీహారీ బుడతడు ఒకానొక దశలో డబుల్ సెంచరీపై కన్నేశాడు. సూర్యవంశీ బాదుడుకు టీమ్ఇండియా 500 మార్క్ అందుకుంటుదనుకున్న అభిమానులకు అతని నిష్క్రమణతో నిరాశే ఎదురైంది. జేమ్స్ మింటో(3/63), అలెక్స్ గ్రీన్(2/49) ఆకట్టుకున్నారు. లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ 40.2 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌటైంది. కాలెబ్ ఫాల్క్‌నర్(115) సెంచరీతో ఒంటరిపోరాటం చేసినా లాభం లేకపోగా, బెన్ డాకిన్స్(66) రాణించాడు. అంబరీశ్(3/56) మూడు వికెట్లు తీయగా, దీపేశ్(2/64), కనిశ్క(2/63) రెండేసి వికెట్లు దక్కించుకున్నారు. అద్భుత ప్రదర్శనతో భారత ప్రపంచకప్ విజయంలో కీలకంగా వ్యవహరించిన వైభవ్ సూర్యవంశీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'తో పాటు సిరీస్ దక్కింది.

## పెళ్లిళ్లలో మద్యం లేకుండా వివాహం చేస్తే రూ.51 వేల ప్రోత్సాహకం

ఇటీవల కాలంలో ఏ వేడుక జరిగినా మద్యం వినియోగం సాధారణంగా మారిపోయింది. ముఖ్యంగా వివాహ వేడుకల్లో అయితే విచ్చలవిడిగా మద్యం సేవించడం కనిపిస్తోంది. మద్యం మత్తులో కొందరు హద్దులు దాటి ప్రవర్తించడం వల్ల గొడవలు, అశాంతి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితిని మార్చాలని ఉత్తరాఖండ్‌లోని ఓ గ్రామ సర్పంచ్ వినూత్న నిర్ణయం తీసుకుని అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డోయీవాలా నియోజకవర్గ పరిధిలో గడుల్ అనే గ్రామం ఉంది. ఈ గ్రామ సర్పంచ్ స్వీటీ రావత్ వివాహ వేడుకల్లో మద్యం వినియోగాన్ని అరికట్టాలని సంకల్పించారు. ఇందుకోసం ఆమె ప్రత్యేక ప్రోత్సాహక పథకాన్ని అమలు చేస్తున్నారు. మద్యం పంపిణీ చేయకుండా పెళ్లి జరిపే కుటుంబాలకు రూ.51 వేల ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇప్పటివరకు రెండు కుటుంబాలు ఈ నిబంధనను పాటించగా, వారికి నగదు బహుమతిని అందజేశారు. శుభకార్యాల్లో మద్యం అందించడం వల్ల అనవసర ఖర్చులు పెరుగుతున్నాయని, యువత మద్యానికి అలవాటు పడే ప్రమాదం ఉందని స్వీటీ రావత్ అభిప్రాయపడ్డారు. సమాజంలో మంచి మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తెలిపారు. గ్రామ ప్రజల నుంచి కూడా ఈ కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందని చెప్పారు. ఆమె చేస్తున్న ఈ ప్రయత్నాన్ని జిల్లా కలెక్టర్ సహా పలువురు అధికారులు ప్రశంసించారు.




## ప్రముఖ మ్యాగజైన్ కవర్‌పై సోలోగా డార్లింగ్

పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ క్రేజ్ జపాన్‌లోనూ విస్తరిస్తోంది. తాజాగా ఆయన జపాన్‌కు చెందిన ప్రముఖ 'అనన్' మ్యాగజైన్ బ్యాక్ కవర్‌పై సోలోగా మెరిశారు. ఈ నెల 10న విడుదల కానున్న 2483వ సంచికపై ఆయన ఫొటోను ప్రచురించారు. ఈ ఫీచర్‌ను "రాయల్ ఆడియన్స్ గ్రావుర్" అంటూ అభివర్ణించిన మ్యాగజైన్, జపాన్ అభిమానులతో ప్రభాస్‌కు ఉన్న బలమైన అనుబంధాన్ని హైలైట్ చేసింది. 'బాహుబలి' సినిమాతో జపాన్‌లో ప్రభాస్‌కు అభిమానగణం ఏర్పడగా, 'సలార్' చిత్రంతో అది మరింత పెరిగింది. ఇక 'కల్కి 2898 ఏడీ' విడుదలతో ఆయన పాప్యులారిటీ శిఖరస్థాయికి చేరింది. ఈ నేపథ్యంలోనే 2025 డిసెంబర్‌లో ప్రభాస్ టోక్యోలో పర్యటించినప్పుడు ఈ ప్రత్యేక ఫోటోషూట్ నిర్వహించారు.



## 'జన నాయగన్' రిలీజ్‌కు గ్రీన్ సిగ్నల్

తమిళ సినీ పరిశ్రమలో ఇళయ దళపతి విజయ్ నటించిన తాజా చిత్రం 'జన నాయగన్' విడుదలకు సంబంధించిన అనిశ్చితి తొలగే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రం మొదట జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కావాల్సి ఉండగా సెన్సార్ సమస్యల కారణంగా వాయిదా పడింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (CBFC) చిత్రంలోని కొన్ని సన్నివేశాలు, డైలాగ్‌లపై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో సర్టిఫికెట్ నిలిచిపోయింది. మీడియాలో వచ్చిన సమాచారం ప్రకారం సుమారు 24 కట్స్ సూచించగా, చిత్ర యూనిట్ మార్పులు చేసి మళ్లీ సమర్పించినప్పటికీ తక్షణ స్పందన రాకపోవడంతో నిర్మాతలు కోర్టును ఆశ్రయించారు. మొదట మద్రాస్ హైకోర్టును ఆశ్రయించిన నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్‌కు అనుకూల స్పందన రాకపోవడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే సుప్రీంకోర్టు సూచన మేరకు ఈ వివాదం మళ్లీ మద్రాస్ హైకోర్టుకే వెళ్లడంతో అక్కడ విచారణ కొనసాగింది. తాజాగా చిత్ర యూనిట్ సెన్సార్ బోర్డ్‌కి కొత్త వర్షెన్ సమర్పించి కోర్టు కేసులని ఉపసంహరించుకోవాలని నిర్ణయించిందని సినీ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తుంది.



## రకుల్ సీరియస్ కామెంట్స్

బాలీవుడ్‌లో పీఆర్ (పబ్లిక్ రిలేషన్స్) వ్యవస్థ, పాపరాజీ సంస్కృతిపై నటి రకుల్ ప్రీత్ సింగ్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇండస్ట్రీలో చాలా మంది తారలు పీఆర్ ఉంటేనే ఎదగగలమని భావిస్తున్నారని, అయితే ఇది సరైన అభిప్రాయం కాదని ఆమె అభిప్రాయపడ్డారు. పీఆర్ వ్యవస్థ కేవలం ఒక పరిమిత స్థాయి వరకు మాత్రమే సహాయపడుతుందని, వ్యక్తిగత ప్రతిభ, నిబద్ధతే ఒక తార స్థాయిని నిర్ణయిస్తాయని రకుల్ స్పష్టం చేశారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# జోగి రమేశ్‌పై నాన్ బెయిలబుల్ కేసు నమోదు

కల్తీ మద్యం కేసులో ఇటీవలే బెయిల్ పై బయటకు వచ్చిన మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ కు మరో షాక్ తగిలింది. ఇబ్రహీంపట్నం పోలీసులు ఆయనపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. Cr.No.76/2026 U/s 223, 189(2), 292, 125(2), 126(2), 132 r/w 190 BNS & Sec 32 of Police Act & Sec 7(1)(a) of Criminal Law Amendment Act: (143, 188, 290, 336, 341, 353 r/w 149 IPC) సెక్షన్ల కింద కేసు నమోదయింది. కేసు వివరాల్లోకి వెళితే... జోగి రమేశ్ ను పరామర్శించేందుకు వైసీపీ అధినేత జగన్ నిన్న ఇబ్రహీంపట్నంలోని ఆయన నివాసానికి వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ పర్యటన సందర్భంగా బైక్ ర్యాలీలు, పబ్లిక్ న్యూసెన్స్, జన సమీకరణ చేశారని ఎస్సై రవి వర్మ ఫిర్యాదు చేశారు. రోడ్లు బ్లాక్ చేశారని, సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేశారని ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. సున్నితమైన ప్రాంతాలలో ప్రజలను రెచ్చగొట్టేలా ప్రవర్తించారని తెలిపారు. జన సమీకరణ, ర్యాలీలు చేపట్టవద్దని కఠిన నిబంధనలు విధించినా... వాటిని ఉల్లంఘించారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఇబ్రహీంపట్నం పోలీసులు ఆయనపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలో కూడా జోగి రమేశ్ పై మరో కేసు నమోదయింది. పోలీసులు విధించిన ఆంక్షలకు విరుద్ధంగా అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించారంటూ పోలీసులు కేసు పెట్టారు. సెక్షన్ 223, 189 క్లాజ్ 2, 292, 125క్లాజ్ 2, 126క్లాజ్ 2, 132, 190, బీఎన్ఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో జోగి రమేశ్ ను మళ్లీ అరెస్ట్ చేస్తారా? అనే ఉత్కంఠ నెలకొంది.



# రేవంత్ అసలు రెడ్డి కాదు: ధర్మపురి అర్వింద్



సీఎం రేవంత్ రెడ్డిపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ అసలు రెడ్డి కాదంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్‌లో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ధర్మపురి అర్వింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. రేవంత్ సీఎం రేవంత్ నిజామాబాద్‌కు వచ్చి నోటికొచ్చినట్లు మాట్లాడారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై శ్రద్ధ లేదు కానీ ప్రశ్నిస్తున్న ప్రత్యర్థులపై ఇష్టారీతిన మాట్లాడుతున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై జోకులు వేస్తున్నారని, దమ్ముంటే ముస్లిం దేవుళ్లపై సెటైర్లు వేయాలని సవాల్ విసిరారు. రేవంత్ కుల రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం తన వ్యక్తిత్వాన్ని అమ్ముకొని కల్వకుంట్ల కుటుంబాన్ని కాపాడుతున్నాడని, వ్యక్తిత్వాన్ని అమ్ముకున్న వాడు రెడ్డి ఎలా అవుతాడని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు, తులం బంగారం హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నెలకు రూ.2,500 ఇస్తామని ఎగ్గొట్టారన్నారు. యువతకు రూ.4,000 నిరుద్యోగ భృతి అన్నారు కానీ అదీ ఇవ్వలేదన్నారు. ఫీ రీయింబర్స్ మెంట్ కూడా ఎగ్గొట్టారని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.



# టీ20 వరల్డ్ కప్‌కు బుమ్రా దూరం

టీ20 వరల్డ్ కప్‌కు ముందు గాయాలు టీమిండియాను కలవరపాటుకు గురి చేస్తున్నాయి. సౌత్‌ఆఫ్రికాతో వార్మప్ మ్యాచ్ సందర్భంగా ఆల్ రౌండర్ హర్షిత్ రాణా గాయపడి సిరీస్‌కు దూరం కావాల్సి వచ్చింది. అతడి స్థానాన్ని బీసీసీఐ హైదరాబాద్ స్టీడ్‌స్టర్ మహ్మద్ సిరాజ్‌తో భర్తీ చేసింది. తాజాగా పేసర్ బుమ్రా వైరల్ ఫీవర్‌తో నేడు యుఎస్‌ఎతో జరిగే ప్రారంభ మ్యాచ్‌కు దూరంగా ఉండబోతున్నట్లు సమాచారం. మరో ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ విషయంలోను క్లారిటీ రాలేదు. సుందర్ గాయం నుంచి ఇంకా కోలుకోలేదు. కాగా, ఇవాళ టీమిండియా ప్రపంచకప్‌లో తమ తొలి మ్యాచ్ యూఎస్‌ఏతో ఆడనుంది.

## పురపోరులో దూసుకెళ్తున్న కారు..
# నేడు కామారెడ్డి జిల్లాలో కేటీఆర్ పర్యటన



మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు కామారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించనున్నారు. బాన్సువాడ, బిచ్కుంద, ఎల్లారెడ్డి పట్టణాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. శనివారం మధ్యాహ్నం జిల్లాకు చేరుకోనున్న కేటీఆర్ ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లలో పాల్గొననున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం వంచించిన తీరును ఆయన ఎండగట్టనున్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని, కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న అవినీతిని వివరిస్తూ ఓట్లను అభ్యర్థించనున్నారు. కాగా, కేటీఆర్ పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు ఇప్పటికే విస్తృత ఏర్పాట్లు చేశారు. బాన్సువాడ, బిచ్కుంద, ఎల్లారెడ్డి పట్టణాల్లో ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లు జరిగే ప్రాంతాలను గులాబీ జెండాలతో ముస్తాబు చేశారు. మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ షిండే దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మధ్యాహ్నం బాన్సువాడకు చేరుకోనున్న రామన్న.. కొయ్యగుట్ట అమరవీరుల స్థూపం నుంచి పట్టణంలోని ప్రధాన రహదారి వెంట రోడ్ షో నిర్వహించనున్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో సుమారు పదివేల మందితో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొంటారని ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు.

# కేక్ సిద్ధం చేసుకున్న ఇంట్లో తీరని విషాదం.. గుంతలో పడి యువకుడి మృతి

అది పశ్చిమ ఢిల్లీలోని ఒక మధ్యతరగతి ఇల్లు. టేబుల్‌పై కట్ చేయని కేక్.. వెలిగించని కొవ్వొత్తులు.. నిశ్శబ్దంగా వేచి చూస్తున్న ప్లేట్లు. తల్లిదండ్రుల పెళ్లి రోజు వేడుక కోసం అంతా సిద్ధమైంది. సరిగ్గా అర్ధరాత్రి 12:50 గంటలకు కమల్ ధ్యాని (25) అనే యువకుడు తన కవల సోదరుడికి ఫోన్ చేసి తల్లికి ఇమ్మన్నాడు. "అమ్మా.. చపాతీలు సిద్ధం చేయి, మరో 15 నిమిషాల్లో ఇంట్లో ఉంటాను" అని చెప్పాడు. కానీ ఆ 15 నిమిషాలు కాస్తా నిరంతర నిరీక్షణగా మిగిలిపోయింది. ఆ యువకుడు మరెప్పటికీ తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయాడు. కాల్ సెంటర్ ఉద్యోగి అయిన కమల్ పని ముగించుకుని తన బైక్‌పై వస్తుండగా జనక్‌పురి వద్ద ఢిల్లీ జలమండలి తవ్విన 15 అడుగుల లోతైన గుంతలో పడి మరణించాడు. సీవరేజీ పనుల కోసం తీసిన ఈ గొయ్యి వద్ద కనీస రక్షణ చర్యలు లేకపోవడం, వీధి దీపాలు లేక ఆ ప్రాంతం అంతా చీకటిమయంగా ఉండటమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. తన సొంత సంపాదనతో ఎంతో ఇష్టంగా కొనుక్కున్న బైకే అతడికి చిట్టచివరి ప్రయాణ సాధనమైంది. అర్ధరాత్రి దాటినా కొడుకు రాకపోవడంతో ఆ తండ్రి, సోదరుడు గాలింపు మొదలుపెట్టారు. ఆఫీసు నుంచి పోలీస్ స్టేషన్ల వరకు తెల్లవార్లూ తిరిగారు. ఉదయం వెలుగు చూశాక.. గొయ్యిలో పడి ఉన్న కమల్ మృతదేహాన్ని చూసి ఆ కుటుంబం కుప్పకూలిపోయింది. "మా నాన్న రాత్రంతా వెతికారు.. ఉదయం తన కొడుకు శవాన్ని చూశారు" అంటూ కమల్ సోదరుడు కరణ్ కన్నీరుమున్నీరయ్యాడు. అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు మండిపడుతున్నారు. కనీసం బారికేడ్లు, సేఫ్టీ నెట్లు కూడా లేకుండా రహదారిని తవ్వడమే ఈ మరణానికి కారణమని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు ఇంజనీర్లను సస్పెండ్ చేశారు. ఒక చిన్న నిర్లక్ష్యం.. ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకోవడమే కాకుండా, ఒక ఇంటి సంతోషాన్ని చిదిమేసింది.

# టీడీపీ మహిళా ఎమ్మెల్యే ఇంటి వద్ద క్షుద్రపూజల కలకలం

ఓ కారులో వచ్చిన కొందరు వ్యక్తులు శింగనమల టీడీపీ ఎమ్మెల్యే బండారు శ్రావణి ఇంటి వద్ద నిమ్మకాయలు, తెల్లనువ్వులు పడేసి వెల్లడం తీవ్ర కలకలం రేపింది. గత కొంతకాలంగా ఇలాంటి ఘటనలు జరుగుతుండటంతో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు భయాందోళనలకు గురవుతున్నారు. తాజాగా ఓ స్విఫ్ట్ కారులో వచ్చిన కొందరు వ్యక్తులు ఎమ్మెల్యే ఇంటి ఎదుట నిమ్మకాయలు, తెల్ల నువ్వులు పడేసి అక్కడి నుంచి వెళ్లిపోతుండటాన్ని గమనించిన ఎమ్మెల్యే అనుచరులు వెంటనే వారిని వెంబడించేందుకు ప్రయత్నించగా, కారు అతివేగంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఆ కారుకు ఏపీ 39 కేఎక్స్ 0986 నంబర్ ఉన్నట్లు గుర్తించారు. ఇటీవలి కొన్ని నెలలుగా తమ ఇంటి వద్ద ఇదే తరహా ఘటనలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే శ్రావణి అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనల కారణంగా తమ కుటుంబ సభ్యులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ కుట్ర వెనుక శింగనమల నియోజకవర్గానికి చెందిన ఓ అసమ్మతి నేత హస్తం ఉండొచ్చని ఎమ్మెల్యే వర్గీయులు అనుమానిస్తున్నారు. రాజకీయంగా ఎదుర్కోలేకే ఇలాంటి మార్గాలను ఎంచుకుంటున్నారని వారు ఆరోపించారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే అనుచరుల ఫిర్యాదు మేరకు అనంతపురం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కారు నంబర్‌తో పాటు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు దర్యాప్తు వేగవంతం చేసినట్లు పోలీసులు తెలిపారు.



# నభా అందాల విందు


ఇస్మార్ట్ శంకర్ ఫేమ్ నభా నటేష్ లేటెస్ట్ ఫోటోలతో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంటారు. తాజాగా స్టైలీష్ లుక్‌లో ఆమె జరిపిన ఫోటోషూట్ ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అవుతున్నది. కన్నడ నటి నభా నటేష్ ఒకప్పుడు హీరోయిన్‌గా మంచి జోరు చూపించారు. కానీ ఏం జరిగిందో ఏమో కానీ ఒక్కాసారిగా తెరకు దూరమయ్యారు. ఆ తర్వాత వరుస ఫోటో షూట్‌లతో ఉనికిని చాటుకుంటూ ఇండస్ట్రీలో అవకాశాల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.తన తొలి సినిమాకే కరునాడ చక్రవర్తి శివరాజ్ కుమార్ సరసన హీరోయిన్‌గా నటించే అవకాశం దక్కించుకున్నారు నభా నటేష్. అదే వజ్రకాయ. ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ నిలవడంతో పాటు కలెక్షన్ల వర్షం కురిపించింది. దాంతో నభా నటేష్‌కు వరుసపెట్టి అవకాశాలు క్యూకట్టాయి. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ పోతినేని హీరోగా వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో నభా నటేష్‌కు తెలుగులో తొలి బ్రేక్ లభించింది. అయితే అంతకంటే ముందే నన్ను దోచుకుందువటే సినిమాలో తెలుగువారిని పలకరించినా ఈ ముద్దుగుమ్మకు చెప్పుకోదగ్గ గుర్తింపు లభించలేదు.




# నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ అగ్ని ప్రమాదం

హైదరాబాద్‌లోని నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మొదటి అంతస్తులో భారీగా మంటలు ఎగిసిపడుతున్నాయి. 5 ఫైర్ ఇంజన్లతో అగ్నిమాపక సిబ్బంది మంటల్ని అదుపు చేస్తున్నారు. దట్టంగా పొగ కమ్ముకుంది. సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కార్యాలయంలోని కంప్యూటర్ ల్యాబ్‌లో ఈ ఘటన జరిగింది. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే బయటికి పరుగులు తీశారు. అయితే ప్రమాద సమయంలో ఇద్దరు లోపలే చిక్కుకుపోయారు. వారిని వెంటనే రక్షించి బయటకు తీసుకొచ్చారు. ఇందులో ఒకరికి గాయాలవగా ఆస్పత్రికి తరలించారు. ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి ఘటనా స్థలానికి చేరుకున్నారు. డీఎన్ఏ పరీక్షలు, ఫింగర్ ప్రింట్ నిర్ధారణలు చేయడంలో ఈ ల్యాబ్‌కు మంచి పేరుంది. ఇది స్టేట్ ఫోరెన్సిక్ ల్యాబ్ కావడంతో అధికారులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఇదే భవనంలో ఫోన్ ట్యాపింగ్‌కి సంబంధించిన కీలక ఫైళ్లు ఉన్నట్లుగా చర్చ నడుస్తోంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు.

# యూపీలో ట్రక్కు బీభత్సం.. ఆరుగురు మృతి




ఉత్తరప్రదేశ్‌లో ఓ ట్రక్కు బీభత్సం సృష్టించింది. డ్రైవర్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న వారిపైకి దూసుకెళ్లింది. దీంతో ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మతురా సమీపంలో యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై శనివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన వారంతా ఢిల్లీ నుండి కాన్పూర్‌కు వెళ్తున్న బస్సు ప్రయాణికులుగా గుర్తించారు. మార్గ మధ్యలో డ్రైవర్ విరామం కోసం బస్సు ఆపినప్పుడు ఈ ఘటన జరిగింది. వేగంగా వచ్చిన కంటైనర్ ట్రక్కు డ్రైవర్ కంట్రోల్ కోల్పోయి ఆగి ఉన్న బస్సును ఢీ కొట్టాడు. బస్సు పక్కనే కొందరు ప్రయాణికులు నిల్చొని ఉన్నారు. ట్రక్కు వేగంగా ఢీకొట్టడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలానికి అత్యవసర సేవల బృందం చేరుకొని వెంటనే రక్షణ చర్యలు చేపట్టింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలిస్తూ, పూర్తి విచారణ ప్రారంభించారు.




# 16.35 కోట్ల ఆస్తులు జప్తు

బీహెచ్‌ఈఎల్ ఉద్యోగుల సొంతింటి కలను ఆసరా చేసుకొని సాగించిన భారీ కుంభకోణంపై దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కీలక అడుగు వేసిం ది. 'వివేకానంద బీహెచ్‌ఈఎల్ ఎంప్లాయీస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ'లో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టిన ఈడీ.. సుమారు రూ.16.35 కోట్ల విలువైన ఐదు స్థిరాస్తులను తాతాలికంగా జప్తు చేసింది. ముత్తంగి గ్రామంలో గృహ నిర్మాణ ప్రాజెక్టు కోసం 316 మంది సభ్యుల నుంచి దాదాపు రూ.18.09 కోట్లను సొసైటీ వసూలు చేసింది. అయితే, ఈ నిధులను సభ్యుల ప్రయోజనాల కోసం కాకుండా, సొసైటీ ప్రెసిడెంట్ డీ శ్రీనివాసరావు, ట్రెజరర్, ఇతర పాలకమండలి సభ్యులు పకదారి పట్టించారు. బిల్డర్ సంస్థ అయిన త్రిభ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి పీ గోవర్ధన్‌రెడ్డితో చేతులు కలిపి సొమ్మును వ్యక్తిగత ఖాతాలకు మళ్లించారు. ఈ నిధులతో కొనుగోలు చేసిన భూములను బిల్డర్, సొసైటీ ప్రెసిడెంట్ తమ వ్యక్తిగత ఆస్తులుగా మార్చుకున్నారు. ఈ క్రమంలో దాదాపు రూ.17.31 కోట్ల మేర నగదు నేరపూరితంగా చేతులు మారినట్టు ఈడీ నిర్ధారించింది. బాధిత సభ్యుల ఫిర్యాదు మేరకు తొలుత సైబరాబాద్‌లోని రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా.. ఈడీ రంగంలోకి దిగి మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టింది. 2025 జూలైలో పోలీసులు సమర్పించిన చార్జిషీటు ఆధారంగా తాజాగా ఈ జప్తు ప్రక్రియను పూర్తి చేసింది.